వీరారెడ్డిపల్లిలో పాఠశాల వార్షికోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

విద్యార్థులను తీర్చిదిద్దాలి

మిరుదొడ్డి (అక్బర్‌పేట-భూంపల్లి), ఏప్రిల్ 8 : విద్యార్థులను విద్యతో పాటు అన్ని రంగాల్లో తీర్చిదిద్దాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి అక్బర్‌పేట-భూంపల్లి మండలంలోని వీరారెడ్డిపల్లిలో చార్వాక స్కూల్ వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన కళా ప్రదర్శనలను తిలకించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ధర్మారం కుమార్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు బాలమల్లేశం గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జీడిపల్లి రవి, మిరుదొడ్డి మాజీ ఎంపీపీ పంజాల కవితా శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్ పన్యాల వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

అసత్య ప్రచారాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్

- ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, ఏప్రిల్ 8: ప్రస్తుత రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అసత్య ప్రచారాలు చేసి గద్దెనెక్కిందని, అధికారంలోకి వచ్చి నాలుగు మాసాలు గడుస్తున్నా ఇచ్చిన ఒక్క హామీ నెరవెర్చలేదని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. సోమవారం గజ్వేల్‌లో జగదేవ్‌పూర్ మండల ముఖ్య కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 11న మధ్యాహ్నం 3గంటలకు మండల కేంద్రంలోని కేసిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించే కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి ప్రతి గ్రామం నుంచి కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా ప్రభుత్వం తాత్సారం చేస్తుందని, మోసపూరిత హామీలతో ప్రజలను తప్పుదొవ పట్టించి ఓట్లు వేయించుకొని మరోసారి ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నం చేస్తుందన్నారు. గడపగడపకూ కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించి, కేసీఆర్ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని తెలియజేయాలన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, ఎంపీటీసీ కవిత, నాయకులు ఇంద్రసేనారెడ్డి, రంగారెడ్డి, యాదవరెడ్డి, సుధాకర్‌రెడ్డి, నరేశ్, చంద్రశేఖర్, ఇక్బాల్, నాగరాజు, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

తెరుచుకున్న ట్రిపుల్ ఆర్ కేంద్రం

హుస్నాబాద్‌టౌన్, ఏప్రిల్ 8: జీవనశైలిలో మనకు అవసరం లేని వస్తువులు నిల్వచేసే ట్రిపుల్‌ఆర్ కేంద్రం ఎట్టకేలకు తెరుచుకుంది. రెండు మాసాలుగా మూతపడిన ట్రిపుల్ ఆర్ కేంద్రంపై 'నమస్తే తెలంగాణ దినపత్రిక'లో సోమవారం వచ్చిన కథనంపై మున్సిపల్ అధికారులు స్పందించారు. ట్రిపుల్ ఆర్ కేంద్రాన్ని ఎందుకు మూసివేశారనే దానిపై కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్ సిబ్బంది ద్వారా ఆరా తీశారు. తక్షణమే కేంద్రాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచాలని ఆదేశించడంతో కేంద్రాన్ని తెరిచారు. ట్రిపుల్‌ఆర్ కేంద్రం షెటర్ రిపేరు ఉందని సిబ్బంది సమాచారం ఇవ్వగా మరమ్మతులు చేయించాలని కమిషనర్ సిబ్బందికి ఆదేశాలు జారీచేశారు.

హుస్నాబాద్‌లో తెరుచుకున్న ట్రిపుల్‌ఆర్ కేంద్రం

వడదెబ్బ నివారణపై అవగాహన

హుస్నాబాద్‌రూరల్, ఏప్రిల్ 8: మండలంలోని పోతారం(ఎస్)లో సోమవారం ఉపాధి హామీ పనులు జరుగుతున్న ప్రదేశాన్ని మీర్జాపూర్ ప్రభుత్వ వైద్యాధికారి నిఖిత సందర్శించారు. అనంతరం ఆమె వడదెబ్బ నివారణపై ఉపాధి కూలీలకు అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్, సిబ్బంది సౌందర్య, సాంబయ్య, కనుకయ్య, దినకర్, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

కొండపాక(కుకునూరుపల్లి), ఏప్రిల్ 8 : కొండపాక మండలంలోని మర్పడగ విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జునస్వామి క్షేత్రంలో సోమవారం సోమవతి అమావాస్యను పురస్కరించుకొని మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. క్షేత్ర నిర్వాహకుడు డాక్టర్ చెప్పెల హరినాథశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. క్షేత్ర నిర్వహణ కమిటీ సభ్యులు శ్రీనివాస్, మర్యాల రవీందర్, నేతి సురేశ్, పాల్గొన్నారు.

పొద్దుతిరుగుడు కొనుగోళ్లు వేగిరం చేయాలి

సీనియర్ అసిస్టెంట్ రాజమల్లుకు వినతి పత్రం అందజేస్తున్న సొసైటీ చైర్మన్ హరికృష్ణారెడ్డి

తొగుట, ఏప్రిల్ 8: పొద్దుతిరుగుడు కొనుగోళ్లు వేగిరం చేయాలని సొసైటీ చైర్మన్ హరికృష్ణారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన పొద్దు తిరుగుడు కొనుగోలు వేగవతం చేయాలని తహసీల్ కార్యాలయంలో సోమవారం సీనియర్ అసిస్టెంట్ రాజమల్లుకు రైతులతో కలిసి ఆయన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండు రోజుల్లో పొద్దుతిరుగుడు కొనుగోళ్లు ప్రారంభించక పోతే రైతులతో కలిసి పెద్దఎత్తున కలెక్టరేట్ ముట్టడిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు జాప్యం చేయడం వల్ల రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. సొసైటీ వైస్ చైర్మన్ కుర్మ యాదగిరి, బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు మల్లారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బక్క కనకయ్య, రైతు బంధు సమితి మాజీ అధ్యక్షుడు కనకయ్య, మాజీ డైరెక్టర్లు, మంగ యాదగిరి, పబ్బతి వెంకటరెడ్డి, మంగ నరసింహులు, నాయకులు సుభాష్, బైరా రెడ్డి, వెంకటేశ్ పాల్గొన్నారు.

బస్సును పునరుద్ధరించాలి

కొమురవెల్లి, ఏప్రిల్ 8: గురువన్నపేట నైట్‌హాల్ట్ బస్సును పునరుద్ధరించాలని సోమవారం ఐనాపూర్, గురువన్నపేట, పోసాన్‌పల్లి గ్రామస్తులు సిద్దిపేట డిపో మేనేజర్ సుఖేందర్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. 20 ఏండ్లకుపైగా సిద్దిపేట బస్సు వేకువజామున, ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం, తిరిగి గురువన్నపేట నైట్‌హాల్ట్ ట్రిప్ ఉండేదని కరోనా వచ్చినప్పటి నుంచి బస్సు రావడం లేదన్నారు. దీంతో ప్రయాణికులతో పాటు విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఐనాపూర్ మాజీ సర్పంచ్ రమణారెడ్డి, కొమురవెల్లి మల్లన్న ఆలయ ట్రస్ట్ మెంబర్ మోహన్‌రెడ్డి, ఐనాపూర్ కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు మల్లం బాలయ్య, అక్కెం బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజాశర్మ

చిన్నకోడూరులో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజాశర్మ

చిన్నకోడూరు, ఏప్రిల్ 8: సాగునీరు అందక ఎండిన పంటల రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజాశర్మ అన్నారు. చిన్నకోడూరు మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని వైస్ ఎంపీపీ కీసరి పాపయ్య అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా జడ్పీ చైర్‌పర్సన్ హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం పంట పొలాలకు సాగునీరు ఇవ్వక పోవడంతో జిల్లాలో చాలా ఎకరాల్లో వరి పంటలు ఎండి పోయాలన్నారు. అకాల వర్షానికి దెబ్బతిన్న పంటల రైతులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఎకరానికి రూ. 25 వేలు పంట నష్టపరిహారం అందజేయాలన్నారు. పొద్దుతిరుగుడు ధాన్యంతోపాటు రైతులు పండించిన ధాన్యాన్ని పూర్తి స్థాయిలో కొనుగోలు చేయాలన్నారు. నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలన్నారు. వేసవి దృష్ట్యా తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. మిషన్ భగీరథ పథకాన్ని సక్రమంగా నిర్వహించి ప్రతి ఇంటికీ తాగునీరు అందించాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్లు కనకరాజు, సదానందంగౌడ్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు శ్రీనివాస్, ఎంపీటీసీలు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

వెంకట్రామిరెడ్డి గెలుపు ఖాయం



రహీమొద్దీన్‌ను సన్మానిస్తున్న బీఆర్ఎస్ మండల నాయకులు, కార్యకర్తలు

రాయపోల్, ఏప్రిల్ 8 : మెదక్ పార్లమెంట్ అభ్యర్థి, మాజీ కలెక్టర్ వెంకట్రామిరెడ్డి గెలుపు ఖాయమని బీఆర్ఎస్ దౌల్తాబాద్ మండల ప్రజాప్రతినిధులు అన్నారు. బీఆర్ఎస్ దౌల్తాబాద్ మండల నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన రహీమొద్దీన్‌ను సోమవారం దౌల్తాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి పలువురు సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మాజీ సర్పంచ్‌లు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన రహీమొద్దీన్‌తో పాటు సీనియర్ మండల నాయకులు దారా సత్యనారాయణ, నర్ర రాజేందర్, ఉమ్మడి నర్సింహారెడ్డి, స్టీవాన్‌రెడ్డి, షేక్‌పాషా మాట్లాడారు. దుబ్బాక నియోజకవర్గంలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి నాయకత్వంలో భారీ మెజార్టీ వచ్చే విధంగా కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు కొనపూర్ రాజిరెడ్డి, సల్ల స్వామి, సయ్యద్ కలీలొద్దీన్, ప్రకాశ్, ఆంజనేయులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

- ఆర్కియాలజీ శాఖ డైరెక్టర్ భారతి హోలికేరి

మాట్లాడుతున్న భారతి హోలికేరి

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 8: అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి వేసవిలో జిల్లాలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆర్కియాలజీ శాఖ డైరెక్టర్ భారతి హోలికేరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో తాగునీటి సరఫరాపై ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ, మండల ప్రత్యేకాధికారులు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, మున్సిపల్ కమిషనర్లు పబ్లిక్ హెల్త్ ఇంజినీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..జిల్లాలోని గ్రామాలు, పట్టణాల్లో ఇంటింటికీ సరఫరా చేసేందుకు అవసరమైన తాగునీరు వనరులు అందుబాటులో ఉన్నాయని.. ఒక వేళ వర్షాలు ఆలస్యంగా కురిస్తే తాగునీటికి ఇబ్బంది లేకుండా ముందస్తు ప్రణాళికతో వెళ్లాలన్నారు. ఎక్కడైనా చిన్న చిన్న సమస్యలు ఉంటే ఈ నెల 15వ తేదీలోగా పరిష్కరించాలన్నారు. నీటి సమస్యపై ఫిర్యాదులు వస్తే వెంటనే పరిష్కరించి తాగునీటి ఇబ్బందులు తీర్చాలన్నారు. కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ.. మండల స్థాయి అధికారులంతా అప్రమత్తంగా ఉండి తాగునీటి సమస్య రాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

శ్రీక్రోధి నామ సంవత్సర చిత్రం ఆవిష్కరణ

సిద్దిపేట కమాన్, ఏప్రిల్ 8: బీదవాడి గుండెల్లో దిగులు దులుపేదే ఉగాది అని ప్రఖ్యాత చిత్రకారుడు రుస్తుం అన్నారు. ఉగాది పండుగను పురస్కరించుకుని సోమవారం సిద్దిపేట రుస్తుం ఆర్ట్ గ్యాలరీలో ఉగాది శ్రీక్రోధి నామ సంవత్సర చిత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఏఎఫ్ అధ్యక్షురాలు జులేఖ రుస్తుం, నైరూప్య చిత్రకారుడు నహీంరుస్తుం తదితరులు పాల్గొన్నారు.

పండుగల ప్రత్యేకతలు తెలియజేయాలి

మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రజితావెంకట్

హుస్నాబాద్, ఏప్రిల్ 8: పండుగల ప్రత్యేకతలను భవిష్యత్ తరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉన్నదని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకట్ అన్నారు. సోమవారం హుస్నాబాద్‌లోని నవభారత్ హైస్కూల్‌లో జరిగిన ఉగాది పండుగ వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. శ్రీక్రోధి నామ సంవత్సరం అందరికీ శుభాలు కలిగించాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు తయారు చేసిన ఉగాది పచ్చడిని, భక్షాలను అందరికీ పంపిణీ చేశారు. వేడుకల సందర్భంగా విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి ఆటపాటలతో అలరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ అయిలేని అనితారెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ గంగరవేని రవి, డైరెక్టర్లు వేల్పుల శ్రీనివాస్, జి రాజు, ప్రిన్సిపాల్ వినీష్‌కుమార్, ఇన్‌చార్జి జయ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కొమ్మూరిని కలిసిన న్యాయవాదులు

చేర్యాల, ఏప్రిల్ 8 : జనగామ డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని సోమవారం చేర్యాల న్యాయవాదుల అడ్‌హక్ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చేర్యాల కోర్టు ప్రారంభోత్సవానికి రావాలని కోరారు. చేర్యాల కోర్టు ప్రారంభోత్సవానికి కావాల్సిన సంపూర్ణ సహకారం అందిస్తానని కొమ్మూరి న్యాయవాదులకు తెలిపారు. న్యాయవాదుల అడ్‌హక్ కమిటీ కన్వీనర్ ఆరేళ్ల వీరమల్లయ్య, కో కన్వీనర్లు గాజుల రవీందర్, మెరుగు రమేశ్, సభ్యులు గూడెపు శ్రీధర్, నీరటి వెంకటేశ్, నల్లగొండ సంతోష్, మోకురాజురెడ్డి, దర్శనం, ప్రశాంత్, వెంకటేశం, సురేశ్ పాల్గొన్నారు.

తమకు కేటాయించిన స్థలాన్ని ఇతరులకు ఇవ్వొద్దు

కొండపాక(కుకునూరుపల్లి), ఏప్రిల్ 8 : తమకు కేటాయించిన స్థలాన్ని ఇతరులకు కేటాయించవద్దని సోమవారం కుకునూరుపల్లి మదిగ కులస్తులు తహసీల్దార్ మల్లికార్జున్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. గతంలో తమకు వైకుంఠధామం కోసం స్థలాన్ని కేటాయించారని, ఆ స్థలంలో నాటి ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి నిధులతో ప్రారంభోత్సవం చేసిన శిలాఫలకం ఉందని తహసీల్దార్‌కు వివరించారు. ఆ స్థలాన్ని మరో వ్యక్తి దొడ్డిదారిన రిజిస్ట్రేషన్ చేయించుకుని అనుమతి కోసం గ్రామ పంచాయతీలో దరఖాస్తు చేసుకున్నాడని, పర్మిషన్ నిలుపుదల చేసి ఆభూమిని తిరిగి తమకు కేటాయించాలని కోరారు.

పేద ముస్లింలకు కానుకలు

దుబ్బాక టౌన్, ఏప్రిల్ 8: నిరుపేదలకు సేవ చేయడంలో నిజమైన తృప్తి ఉంటుందని బిస్మిల్లా బైతుల్మాన్ ట్రస్టు చైర్మన్ ఎండీ.చాంద్‌మియా పేర్కొన్నారు. సోమవారం దుబ్బాకలో రంజాన్ పండుగను పురస్కరించుకొని నిరుపేద ముస్లింలకు ట్రస్టు ఆధ్వర్యంలో రంజాన్ కానుకలు అందజేశారు. కార్యక్రమంలో ఖధీర్‌అలీ, షబ్బీర్‌మియా, చాంద్, మజర్‌అలీ, అలీం, షంషీర్, జమ్మీర్, సమీర్, ఫౌజీయా పాల్గొన్నారు.



కుకునూరుపల్లిలో మాట్లాడుతున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

కేసీఆర్ పాలనలో తెలంగాణ సస్యశ్యామలం

- ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

కొండపాక(కుకునూరుపల్లి), ఏప్రిల్ 8 : తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ పాలనలోనే రాష్ట్రం సస్యశ్యామలంగా మారిందని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. సోమవారం కుకునూరుపల్లి మండల కేంద్రంలోని ఆంజనేయులు గార్డెన్‌లో పీఏసీఎస్ వైస్ చైర్మన్ పిస్క అమరేందర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ పాలనలోనే పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందజేశారని గుర్తుచేశారు. నేడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను తుంగలో తొక్కిందని విమర్శించారు. కేంద్రంలో ప్రధాని మోదీ లక్షలాది కోట్ల రూపాయలు అప్పు తెచ్చి ప్రజలపై భారం వేశారని మండిపడ్డారు. కాళేశ్వరంలో చిన్న సమస్యను అడ్డుపెట్టుకొని రైతుల పొట్టకొట్టేలా లక్షల ఎకరాలు ఎండబెట్టారన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేసి లోక్‌సభ ఎన్నికల్లో ఓటు అడగాలని హితవు పలికారు. పార్లమెంట్‌లో తెలంగాణ హక్కుల కోసం కొట్లాడే మెదక్ ఎంపీగా వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో నాయకులు పొల్కంపల్లి నరేందర్, కె.ఐలయ్య, లక్ష్మణ్‌రాజు, కనకయ్య, మల్లం ఐలయ్య పాల్గొన్నారు.

వర్గల్‌లో విమాన రథంపై ఊరేగుతున్న లక్ష్మీనరసింహమూర్తి

వైభవంగా రథోత్సవం

వర్గల్, ఏప్రిల్ 8: జగన్నాటకసూత్రధారి..లోకాలనేలే దేవుడు నాచగిరి లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం సోమవారం ఉదయం వైభవంగా జరిగింది. వేలాదిగొంతుకలతో చేసిన నినాదాలు పవిత్ర హరిద్రానది తీరాన దేవాలయానికి మంగళహారతులు పట్టినట్లుగా చేశాయి. పవిత్రగోదావరి జలాల పుణ్యస్నానాలతో హరిద్రానది తీరం పులకించింది. అంతకుముందు ఆదివారం రాత్రి లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో మంత్రహోమం, మంత్రపుష్పం, అలంకార సేవలు ముగిసిన తర్వాత తెల్లవారుజామున లక్ష్మీసమేతంగా రథంపై ఊరేగించారు. స్వామివారి ఊరేగింపులో కోలాటాలు, డప్పువాయిద్యాల విన్యాసాలు భక్తులను రంజింపజేశాయి. స్వామివారి ఊరేగింపు అనంతరం చక్రస్నానం, పూర్ణాహుతి, దేవతోద్వాసం, తీర్థప్రసాద వితరణలు జరిగాయి. లక్ష్మీనరసింహస్వామి రథోత్సవ ఊరేగింపును పురస్కరించుకొని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, ఆలయ మాజీ చైర్మన్లు,ప్రజాప్రతినిధులు పెద్దసంఖ్యలో హాజరై దేవతామూర్తులను దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఈవో అన్నపూర్ణ, సీనియర్ అసిస్టెంట్ సుధాకర్‌గౌడ్, అర్చక, సిబ్బంది పాల్గొన్నారు.

రంజాన్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

సిద్దిపేట, ఏప్రిల్ 8: రంజాన్ పండుగను పురస్కరించుకొని సిద్దిపేట పట్టణంలోని మసీదులు, ఈద్గాల వద్ద పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ కమిషనర్ ప్రసన్న రాణి అధికారులను ఆదేశించారు. సోమవారం సిద్దిపేట పట్టణంలోని ఎక్బాల్‌మినార్ వద్ద గల ఈద్గాలో రంజాన్ ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. పండుగ ఏర్పాట్లతో పాటు, శానిటరీ పనులను త్వరగా పూర్తిచేయాలని అధికారులకు సూచించారు.

వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి

సిద్దిపేట, ఏప్రిల్ 8: వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని జిల్లా వైద్యాధికారి శ్రీనివాస్ సూచించారు. సోమవారం జిల్లా కార్యాలయ సమావేశ మందిరంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతాశిశు మరణాలు జరుగకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయాలన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వోలు వినోద్ బాబ్జి, ప్రభాకర్, శ్రీనివాస్, ప్రోగ్రాం ఆఫీసర్లు విజయరాణి, రజిని, శ్రీదేవి, శ్రీకాంత్, ప్రవీణ్‌నాయక్, వైద్యాధికారులు, సిబ్బంది యేసుమేరి, రవీందర్‌రెడ్డి, ఏవో, డేనియల్ సీసీ, సూపర్‌వైజర్లు, డెమోనవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆశలకు చీరలు, ఆడబిడ్డకు చెక్కు పంపిణీ

బెజ్జంకి, ఏప్రిల్ 8: మండల కేంద్రంలో లింగాల యువసేన ఆధ్వర్యంలో లింగాల లక్ష్మణ్ పుట్టినరోజు సందర్భంగా సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఆశ కార్యకర్తలు, సిబ్బందికి చీరలు, కత్తి తేజేశ్వని, అజయ్‌లకు ఆడబిడ్డ జన్మించగా రూ.5016 చెక్కు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, లింగాల లక్ష్మణ్, వెంకటేశ్, పరశురాములు, అజయ్, దిలీప్, బీమయ్య పాల్గొన్నారు.

నారాయణరావుపేటలో ఫ్లాగ్ మార్చ్

నారాయణరావుపేట, ఏప్రిల్ 8: లోక్‌సభ ఎన్నికల సందర్భంగా నారాయణరావుపేటలో సోమవారం కేంద్ర బలగాలు సీఐఎస్ఎఫ్, సర్కిల్ పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను, ఎస్సై అపూర్వరెడ్డి, బెజ్జంకి ఎస్సై కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మతోన్మాద బీజేపీని ఓడిద్దాం

చేర్యాల, ఏప్రిల్ 8: మతోన్మాద బీజేపీని ఓడిద్దామని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అన్నారు. సోమవారం చేర్యాల పట్టణంలో చేర్యాల టౌన్, చేర్యాల రూరల్, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాల కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఎం జనగామ జిల్లా కార్యదర్శి కనకారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యుడు అడివయ్య, జిల్లా కార్యదర్శి శశిధర్, గోపాలస్వామి, సత్తిరెడ్డి, ఎల్లయ్య, వెంకట్ మావో, యాదగిరి, అరున్‌కుమార్ పాల్గొన్నారు.

శోభాయాత్ర కరపత్రం ఆవిష్కరణ

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 8 : మహనీయుల జయంతి ఉత్సవ శోభాయాత్రను ఈ నెల 11న సిద్దిపేటలో ఘనంగా నిర్వహించనున్నట్లు డీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి రవిబాబు తెలిపారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో అందుకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సదన్, చందు, రాజు, పరమేశ్వరి, అంజి, అనిల్ దీపక్, ప్రసన్న పాల్గొన్నారు.

చేర్యాల కవికి ఉగాది జాతీయ పురస్కారం

చేర్యాల, ఏప్రిల్ 8 : మన మతృబాష తెలుగు సాహిత్య సామాజిక అంతర్జాల మాసపత్రిక ఆధ్వర్యంలో శ్రీ క్రోధి ఉగాదిని పురస్కరించుకొని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన 371(వచన, పద్య, గేయ) కవితల పోటీల్లో చేర్యాలకు చెందిన ఉప్పల ప్రభాకర్ పద్య కవిత ఎంపికైంది. ఈ మేరకు ప్రభాకర్‌కు ఉగాది జాతీయ పురస్కారంతో పాటు నగదు బహుమతి అందజేయనున్నట్లు చిర్ర కవిత సంపాదకులు ప్రకటించారు. ఈ సందర్భంగా ఉగాది పురస్కారానికి ఎంపికైన ప్రభాకర్‌ను చేర్యాల రచయితల సంఘం కవులు మంగళగిరి రామచంద్రమూర్తి, ఎలికట్టె అయిలయ్య, గుళ్లపల్లి కాంతికృష్ణ, తౌట రామాంజనేయులు, మల్లావజ్జల చంద్రశేఖర్‌శర్మ, అంబటి అంజయ్య, రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి అభినందించారు.

హుస్నాబాద్‌లో అన్నదానం

హుస్నాబాద్, ఏప్రిల్ 8: హుస్నాబాద్‌లోని అన్నపూర్ణ సేవా సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని బస్టాండ్ ఎదురుగా సోమవారం అన్నదానం చేశారు. ప్రతి అమావాస్య రోజు అన్నదానం చేస్తున్నామని నిర్వాహకులు ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో సమితి ప్రతినిధులు నీరుమల్ల నాగరాజు, బెజుగం భద్రయ్య, నార్ల లక్ష్మీనారాయణ, గౌరిశెట్టి రవీందర్, కొండూరి మహేందర్, నీల శేఖర్, కొండ్లె రాజు, మంచాల రవి, నూక సంపత్, రాగి సుధాకర్, కొండూరి శ్రీనివాస్, నూక రాము, తేజ, కార్తీక్ పాల్గొన్నారు.

జూదం స్థావరంపై దాడులు

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 8 : జూదం స్థావరంపై టాస్క్‌ఫోర్స్, వన్‌టౌన్ పోలీసులు సోమవారం దాడి చేసి నగదు, మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ లక్ష్మీబాబు మాట్లాడుతూ.. సర్కిల్ పరిధిలోని కంచరు బజారు సదానందం ఇంట్లో కొంతమంది జూదం ఆడుతున్నారని నమ్మదగిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కలిసి ఏకకాలంలో దాడి చేశామని చెప్పారు. జూదం ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.13 వేల 993 నగదు, ఆరు మొబైల్ ఫోన్లను స్వ